
# ముగ్గురమ్మాయిలు

— వి. శశాంక



హఠాత్తుగా ఆ గది తలుపులు తెరుచుకున్నాయి. వినురుగా లోపలికి నెట్టారెవర్నో టక్కున తలుపులు మరలా మూసుకున్నాయి.

"మూడు" అన్నదో గొంతు.

"నెంబర్ త్రీ" అన్నదింకో కంఠం.

లోపలవర్ధ ఆ శల్తీ కాళ్లూచేతులూ కూడగట్టుకుని లేవబోతూ ఆ స్వరాలు వినవచ్చిన వైపుకి అనుమానంగా కాస్త భయంగా తలెత్తి చూసింది.

దాదాపు తన వయసులోనేవున్న ఇద్దరాడపిల్లలు. ఒకమ్మాయి గోడకి ఆనుకుని మోకాళ్లచుట్టూ చేతులుచుట్టి కూర్చునుంది. చేతులు కట్టుకుని కుతూహలంగా చూస్తూ నుంచునుంది మరోఅమ్మాయి.

ఒక్క క్షణం వారివంక సందేహంగానూ,ఆయోమయంగానూ చూసిందా కొత్తపిల్ల.

వాళ్ల వాలకాలు గమనించాక వాళ్లూ తన లాంటి మందతప్పిన లేగదూడల్లాంటి వాళ్లే అన్న విషయం గ్రహింపయ్యింది.

మరుక్షణమే తట్టుకోలేనంత దుఃఖోద్వేగం ముంచెత్తగా ముడుకుల మధ్యన మొహం దాచుకుని భుజాలు కదిలేలా విలపించసాగిందా అమ్మాయి

గోడకి ఆనుకుని కూర్చున్న అమ్మాయిలో కదలిక వచ్చింది. లేచిమెల్లగా పక్కకి వచ్చి కూర్చుంది. "ఏడవమాకు" అంది భుజంమీద చెయ్యేసి అనునయంగా.

ఒకసారి తలెత్తి తడికళ్లతో దీనంగా చూసి మళ్లీమొహం దించుకున్నది కొత్త అమ్మాయి.

నుంచునివున్న అమ్మాయికూడా దగ్గరకొచ్చి మరోపక్కన కూర్చుంది మౌనంగా.

"ఊరుకో. ఎంతఏడ్చినా ఎవరు పట్టించుకుంటారు మనని..." దిగులుగా అన్నది మొదటి అమ్మాయి.

"చుక్కల లోకానికెగురుతున్నామనుకుంటూ నేలకానకుండా పరుగులుతీసి ఈ మురికి గుంటలో పడిపోయాం. నిజమే. ఇప్పుడెంత ఏడ్చేం లాభం!"ఎటోచూస్తూ నిస్పృహగా అన్నది రెండో అమ్మాయి.

మూడో అమ్మాయి మళ్లీ తలెత్తింది. "మిమ్మల్నీ నాలాగే...?" సంశయంతో ఆగింది. "మరి? ఇలాటి చోట్లకి ఎవరైనా ఇష్టంమీద వస్తారంటావా... లేకపోతే ఇక్కడే పుడతారనుకుంటున్నావా?" మొదటి అమ్మాయి ఏడవలేని నవ్వునవ్వుతూ అన్నది.

వయసు సమానం. వచ్చిన విపత్తు సమానం. పడుతున్న ఆవేదనా సమానం. వాళ్లు ముగ్గురూ కలిసిపోటానికి ఎంతోసేపు పట్టలేదు.

ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఒకరి కథనింకొకరికి చెప్పుకున్నారు.

★ ★ ★

మొదటి అమ్మాయి పేరు సీతాలక్ష్మి... కాదు సీతాలు. ఒక పాలేరు కూతురు. పల్లెలో పుట్టి పల్లెలో పెరిగిన సీతాలు అడవిమల్లె. అచ్చమైన అమాయకత్వానికి నిర్వచనం.

బల్లకట్టుమీద కాలవ దాటితే మరో సలభై గడపలున్న ఇంకో పల్లె వుంటుందని తప్ప వేరే లోకమెరుగని వెర్రిబాగులపిల్ల. సీతాల్ని మాటలతోనే అద్భుతప్రపంచాల్ని సృష్టించి చూపించగల వరహాలరావు తన వల్లో వేసుకోటానికి అంతగా శ్రమపడలేదు.

మట్టి పిసుక్కోటంతప్ప మరోటంటూ వుందని మరిచిపోయిన ఆ పల్లెవాసులతో ఏడాదికోసారి కళాపోషణ చేయించటానికొస్తుంది టూరింగ్ సినిమా. దాంతోపాటు వచ్చాడొకసారి వరహాలరావు.

సీతాలు ఆ హాలు వూడ్చేపనికి కుదురుతుంది ఆ ఏడే. అక్కడ పరిచయమైంది ఆ ఇద్దరికీ.

వరహాలరావు కలియుగ స్వర్గం సినీమాయాలోకంలో చెడతిరిగిన మనిషి. ఎవరిని ఎక్కడ పడగొట్టాలో తెలిసిన చతురుడు.

సీతాల్నిమొదటిసారి చూసినప్పుడు 'వాహ్ విలేజ్ బ్యూటీ' అనుకున్నాడు మనసులో.

ఒకరోజు పిలిచి ఫ్రీపాస్ చేతిలోపెట్టాడు.

అది సినిమా టిక్కెట్టూ కాదు- రిజర్వు బాంక్ తాళాలు- అన్నంత సంబరంగా అందుకున్న సీతాలు కళ్లలో మెరిసిన మెరుపులు చూసి 'ఫరవాలేదు- చేతికి చిక్కే పిట్టే' అని అంచనా వేసుకున్నాడు.

సినిమా చూసే సమయాన పమిట జారినా చూసుకోని ఆ తన్మయం, ఆల్చిప్పల్లాంటి ఆ కళ్లు ఇంకా వెడల్పాయి తెరకే అంకితమయిపోవడం, చిన్నగా తెరచిన నోరు ఆనందాతిరేకంతో కూనిరాగాలు తీయటం... అదంతా చూసి ఏ సమ్మోహనాస్త్రంవేసి ఆమెని వశపర్చుకోవచ్చునో తేల్చుకున్నాడు.

మెల్లగా చనువు చేసుకున్నాడు. ఆ తర్వాత కబుర్లలోకి దింపాడు.

ఎవరికి ఏరకం ప్రస్తావన నచ్చుతుందో కనిపెట్టడం, చాకచక్యంగా ఆ తోవనే సంభాషణ నడిపి అవతల వారికి ఇష్టుడవటం, తను వారి శ్రేయోభిలాషినన్న నమ్మకం కలిగించటం అతనికి వెన్నతో పెట్టిన విద్య.

మొదట సినీజగత్తులో తానెంత ప్రముఖుడో తనమాటకెంత విలువుందో ఉదాహరణలతోసహా వివరిస్తూ ప్రారంభించాడు. వాళ్లంతా తనచుట్టాలూ నేస్తాలేనని నమ్మబలికాడు. సినిమా తారలూ, వాళ్ల బంగళాలూ, వాళ్ల వైభవమూ వర్ణించి చెప్పాడు. ఇంతాచేస్తే వాళ్లు నీ కాలిగోటి ముందు బలాదూరన్నాడు. నువ్వక్కడ అడుగుపెడితే హీరోయిన్లందరూ దాసీవేషాలేయాల్సిందే అన్నాడు.

అసలు నువ్వేమిటీ నీ అపూర్వసౌందర్యమేమిటీ- నువ్వసలు నేలమీద నడవాల్సిన దానివి కాదని పొగిడాడు. నువ్వొప్పుకుంటే పాలరాతిమీద పర్షియన్ తివాచీ పరిపించి నీపాదాలు మోపించనా అని ప్రలోభపెట్టాడు. నువ్వు 'ఊ' అనాలేగానీ ఎలిజబెత్ టేలరంతదాన్ని చేసే పూచీ తనదని నొక్కి వక్కాణించాడు. ఎలిజబెత్ టేలరంటే ఎవరోకూడా అతనే చెప్పాల్సొచ్చిందనుకోండి- అది వేరేసంగతి.

అప్పటికే పగటి కలల్లోకి జారిపోయి చంద్ర

లోకం సెట్టుమీద హీరోతో డ్యూయెట్ పాడుతోన్న సీతాలు ఈ అనటానికి నందేహించలేదు నరి కదా నంబరవడింది.

వక్కవూర్లో తీర్థం చూసొస్తానని చెప్పి ఇల్లుదాటింది. ఆ తర్వాత ఊరుదాటింది. ఆతర్వాత చెయ్యి మారింది. ఆ తరవాత ఇంకెక్కడికి మార్చటానికో ఇక్కడికి చేరింది.

★ ★

రెండో అమ్మాయి సాకేత- ఒక పెద్ద పారిశ్రామికవేత్త గారాబువట్టి.

ఐశ్వర్యంతోపాటు మితిమీరిన ఆధునికత అలవడిన ఫామిలీ వాళ్లది.

పిల్లలంటే ముద్దొచ్చే బొమ్మల్లాంటి వాళ్లు, వాళ్లని గారాం చెయ్యాలి, మన స్టేటస్‌కి తగ్గట్టు తయారు చెయ్యాలి తప్ప కట్టుబాట్లతో బంధించటం అనాగరికమనే భావంకలవాళ్లు.

తల్లి అల్ట్రా మోడ్రన్ స్త్రీ, క్లబ్‌లూ, సోషల్ వర్క్, షాపింగులలో మునిగి తేలుతుంటుంది. తండ్రి బోర్డు మీటింగులూ, కాన్ఫరెన్స్‌లూ, పార్టీలతో సతమతమవుతూ వుంటాడు.

ఏ బ్రేక్‌ఫాస్ట్ దగ్గరో "హలో బేబీ" అనో, నిద్రపోయే టైముకి హడావిడి పడుతూ వచ్చి "హాయ్ డార్లింగ్ స్వీట్ డ్రీమ్స్" అనో వలకరిస్తారు- అంత వరకే పిల్లలతో వాళ్లకుండే టచ్.

కంటితో సంజ్ఞచేస్తే కాలి దగ్గరికి అమర్చిపెట్టేందుకు సర్వెంట్ మెయిడ్స్ వున్నారు. కొండ మీద కోతిని కోరితే ఎందుకూ అని అడక్కుండా డబ్బు విసిరి దింపగల తాము వున్నారు- అంతే పిల్లల యందు వాళ్లు తీసుకునే బాధ్యత.

అలాంటి పేరెంట్స్ పెంపకంలో సాకేత ఫ్రీ బర్డ్. అవసరానికి మించిన పాకెట్‌మనీ. మోడరన్ డ్రస్సులూ, డాబుసరీ, బాయ్‌ఫ్రెండ్స్‌తో పిక్నిక్‌లూ, పార్టీలూ... వీటన్నిటి మధ్యనా చదువు ఒకచిన్న అసైన్‌మెంట్ ఆమెకి.

ఒక జాలీ ట్రిప్‌లో తగిలాడు ప్రేమ్ ఆమెకి.

"ఎందుకోసం వెడుతున్నారక్కడికి?" అడిగాడు. బస్సులో నిస్సంకోచంగా తన వక్కసీట్‌లోకి వచ్చి కూర్చున్న సాకేతని- ఆమె, ఆమె ఫ్రెండ్స్ వెడుతున్నది ఏమంత ఇంపార్టెంటు ప్లేసు కాదని తెలిసి.

"నథింగ్. జస్ట్ ఎంజాయ్‌మెంటుకి ఎక్కడికయితేనేమిటి?" అన్నది కూలాసాగా. ఎవరినీ లెక్కచేయని ఆ నిర్లక్ష్యం. ఒక యువరాణి కంఠంలో వినిపించే ఆ సహజదర్పం, గర్వం. చిందులేసే ఆ కళ్లు, అందంగా కత్తిరించిన క్రోటన్ మొక్కల్లాంటి ఆమె సౌందర్యం అన్నిటినీ వరీక్షగా చూశాడు ప్రేమ్.

"తినడం, తిరగటం, డిస్కోమ్యూజిక్ పెట్టుకుని గెంతులేయటం, ఇంటికి రావటం... ఇంతేగా... ఇదీ ఒక ఎంజాయ్‌మెంటేనా?" అన్నాడు చులకన ధ్వనిస్తూ.

"మరింకేమి చెయ్యాలేమ్?" ఆశ్చర్యంగా అడిగింది సాకేత.

"నేను చెప్పను. చూపించగలను" ఊరింపుగా అన్నాడు ప్రేమ్.

ప్రతిదీ అతితేలిగ్గా తీసుకునే సాకేత వెంటనే అతనికి డేటిచ్చేసింది.

నిజంగానే ప్రేమ్ ఆమెకి కొత్తకొత్త అనుభవాలంటే ఏమిటో చూపించాడు.

ఎమ్యూజ్‌మెంట్ పార్కుల్లో తిప్పాడు. స్కిల్ గేమ్స్ మప్పాడు. ఆ గాంబ్లింగ్ ఆటలు, ఆ వంచాలు, ఆ మజా చవిచూపించాడు.


కొత్త

గ్లూకోవిటా®

# ఇన్‌స్టాపెప్

## గ్లూకోజ్ శక్తి బిళ్ళలు






మీరు పొద్దున్నే యింటినుంచి బయలుదేరేటప్పుడు చలాకీతో స్ఫూర్తిగా వుంటారు. కాని రోజు అయిపోతున్నకొద్దీ, మీలోని ఆ చలాకీ, స్ఫూర్తీ కూడా అయిపోతూవుంటుందిక. కొత్త ఇన్‌స్టాపెప్ బిళ్ళలతో మీకు స్ఫూర్తిని యివ్వగల తేలికైన పద్ధతి అందుతుందిక. ఇన్‌స్టాపెప్ బిళ్ళలు తీసుకోండి, దాంతో మరి రుచితోబాటే కొత్త శక్తి వచ్చిన ఆ అనుభవాన్ని పొందండి.

వీటిని మీవెంటే ఎక్కడికైనా తీసుకువెళ్ళడం ఎంతో తేలిక. ఈ చిన్న ప్యాకెట్‌ని మీ జేబులో గాని, పర్సులో గాని వేసుకుని ఎక్కడికైనా తీసుకువెళ్ళచ్చును. ఎప్పుడైనా తీసుకోవచ్చును, స్ఫూర్తిని పొందవచ్చును.

కొత్త ఇన్‌స్టాపెప్ బిళ్ళలు— మీరు బాగా ఎరిగిన గ్లూకోవిటా యొక్క శక్తితో నిండివున్నాయివి. దీనికి గల చక్కని నారింజ రుచి అయితే మరి మీలో అడుగడుగుకీ శక్తినిస్తూనే వుంటుంది.

## అడుగడుగుకీ స్ఫూర్తి, శక్తి

OBM/4249/TL

రేనులకి తీసుకువెళ్లాడు.

గంజాయి దమ్ములాగుతూ 'దమ్మారొదమ్...' అనిసొలిపోతూ పాడుకోటంలోవున్న మత్తుని రుచి చూపించాడు.

ఆ ఎడ్వెంచర్స్‌లోని థ్రిల్‌ని పూర్తిగా ఎంజాయ్ చేసిన సాకేతకి త్వరలోనే అతనంటే గొప్ప గురి ఏర్పడిపోయింది.

అప్పుడు అసలు రంగంలోకి దిగాడు ప్రేమ్.

"గొప్ప కిక్ ఇచ్చే చిన్న ప్లాన్ చెప్పనా?" ఆశపెడ్తున్నట్టు అన్నాడు.

"యా" ఉత్సాహంగా తలూపింది సాకేత.

"దీన్ని కిడ్నాపింగ్ గేమ్ అంటారు. రేపు నువ్వు కాలేజీనించి అటునుంచటే నా దగ్గరకు వచ్చేస్తావు. నిన్ను వారం రోజులపాటు దాచేస్తాను. అంటే ఆ వారమూ మీ వాళ్లెవరికి కనబడకుండా దూరంగా ఎక్కడో వుండి పోతామన్నమాట- ఇక చూసుకో నీ కోసం గాలింపు, రేడియోలో ఎనౌన్స్‌మెంట్స్, టీవీలో, పేపర్లలో ప్రకటనలు, పోలీసుల ఇన్వెస్టిగేషన్... ఒక పెద్ద ఇండస్ట్రియలిస్ట్ డాటర్‌ని కిడ్నాప్ చేశారంటే ఊరంతా ఎంత గందరగోళమయిపోతుందో ఊహించుకో.. మనం మాత్రం కూల్‌గా ఐక్‌క్రీమ్ తింటో, వీడియో చూసుకొంటో తెరచాటునుంచి అందరూ ఎంత టెన్షన్ ఎక్సైట్‌మెంట్ ఫీలవుతున్నారో చూస్తూ నవ్వుకుంటుంటాం"

"తర్వాత?" ఉద్రేకంగా అడిగింది సాకేత.

"వారం తర్వాత కామ్‌గా ఇంటికెడతావ్. అడిగినవాళ్లకి గొప్ప సస్పెన్స్ స్టోరీ అల్లి చెబుతావ్. కిడ్నాపర్స్ నిన్నో కొండ గుహలో బంధించారనీ, హింసించారనీ, డబ్బుకోసం మీ నాన్నని డిమాండ్ చెయ్యటానికి ఫోన్ చేస్తామన్నారనీ- ఈలోగా నువ్వు వాళ్లకెలాగో టోకరా ఇచ్చి తప్పించుకుని, అష్టకష్టాలు పడి ఇంటికి చేరాననీ ఇలా... ఇలా... నీ చేతొచ్చినన్ని మలుపులు తిప్పి చెబుతావ్. ఇక చూసుకో- కొన్నాళ్ల వరకూ ఇంటా బయటా హీరోయిన్‌వి నువ్వు. మజుబూర్ లడికీవి, సాహస బాలికవి. ఇంకా ఇంకా ఎన్నో కితాబులు, పొగడ్తలు... అదీ... ఎలా వుంది. మన పథకం?"

"ట్రిమెండస్"

సాకేత ఎలాటి ప్రతిఘటన లేకుండా ప్రేమ్‌తో రైలెక్కింది.

వక్కస్టేషన్‌కి టికెట్ తెస్తానన్న ప్రేమ్ ఒకటిన్నర రోజులకి అడంగుకి చేరే ఆ రైలు కొనవరకూ సాగేదాకా సాకేతని ప్రయాణం చేయించాడు. ఇక్కడ వదేశాడు.

మూడవ అమ్మాయి సుభద్ర తాలూకా ఆఫీసు గుమస్తా తారకంగారి అయిదుగురి సంతానంలో నడిమిది. ముగ్గురాడపిల్లల్లో పెద్దది.

తారకంగారి సంపాదన ఆ కుటుంబానికి కోపీనానికి ఎక్కువ. అంగవస్త్రానికి తక్కువ. అంచేత అనవసర ఖర్చులకి ఏమాత్రమూ తావుఇవ్వరా ఇంట్లో.

అలాటి వృథా ఖర్చుల్లో ఒకటిగా ఉద్దేశ్యపడ్డంవల్ల ఆ ముగ్గురక్క చెల్లెళ్ళ చదువులూ హైస్కూలు దాటకుండానే గట్టెక్కేసేయి.

యవ్వనం చిగురువేస్తున్న వయసు చాలా దుందుడుకుది. చేతినిండావని. సక్రమమైన శిక్షణా వుండటం చాలా ముఖ్యమా సమయంలో.

సుభద్రకి చదువాగిపోయాక ఏవ్యాపకమూ లేకపోయింది.

ఆడపిల్ల ఇల్లుకదలరాదని తల్లి ఆంక్ష.

ఆవిడ చెప్పే చిట్టీపొట్టీ పనులు చేసిపెట్టడం, అడపాదడపా పెళ్ళిచూపుల ఇంటర్వ్యూలకి హాజరవటం, వీటికిపోగా మిగిలిన సమయమంతా పావలాతో దొరికే అద్దెపుస్తకాల్తోనే సుభద్రకాలక్షేపం.


ముందుపొద్దు గడవటంకోసం ప్రారంభమైనా ఆ తరవాత్తరవాత ఆ నవలలే వ్యసనంగా పరిణమించాయామెకి. కూడూనీళ్లకంటే. ముఖ్య అవసరాలయ్యేయి.

అవును, అవి కథలా..కాదు కన్నెపిల్లకనే పగటి కలల అక్షరరూపాలు.

అందులోని ఆరడుగుల అందమైన హీరోలు! అతడెక్కివచ్చే ఓడలాంటికారు, ఆకువచ్చని నీడలు తేలే అతని చెంపలు, వట్టుదల చిహ్నంగా బిగుసుకునే దవడకండరాలూ ఆమెను మోహపెట్టేవి.

అభిమానమే ఆభరణమైన అతని హీరోయినుతో కంపేరిజమ్ ఆమె ఆశలకు ఊపిరులూదేది.

ఎప్పుడో హటాత్తుగా అలాటి హీరో తనకీ తటస్థపడతాడనీ, పూలత్రోవ వెంట తనతోపాటూ ఆనందలోకాలకి నడిపించుకు పోతాడనే వెర్రి నమ్మకం ఆ నవలలు చదివేకొద్దీ ఆమెలో గాఢమయిపోయింది.



ఆమె అనుకొన్నట్టుగానే ఎదురింటిమేడలో అద్దెకిదిగిన శరత్ ఆమె ఊహలకి ఆకృతిఇచ్చాడు. అయితే కొద్దిగా సవరణ. అన్ని నవల్లోలా ఇక్కడ అభిమానధనురాలైన నాయిక హీరోని నెగ్లెక్టు చేయటం, ధీరోదాత్తుడైన నాయకుడు ఆమెను మెప్పించి ఆమె మనసును గెలుచుకోవటంకాక,-

ఎదురింటి అందమైన ఆడపిల్లకేసి శరత్ మొగబుద్ధితో చూసిన మొదటి దొంగచూపులకే రియాక్టయి చిరుచిరునవ్వులతో క్రీగంటి చూపులతో బదులిచ్చి అతన్ని కటాక్షించేసింది సుభద్ర.

కారుకాకపోయినా స్కూటరు మెయిన్‌టెయిన్ చేస్తున్నవాడు, టిప్‌టాప్‌గా పూటకోడ్రస్సు మారుస్తూ కలవారిబిడ్డడని చెప్పకచెబుతున్నవాడు, తానెదురుచూస్తున్న అందగాడు ఇన్నాళ్లకి ఎదురువడ్డాడు- లేనిపోని బింకం చూపిస్తే ఎక్కడ చెయిజారిపోతాడోనని ఆ అమ్మాయి భయం ఆ అమ్మాయిది పాపం,

ఆశించని ఈ ఆహ్వానానికి ముందు తబ్బిబ్బయినాడు శరత్. ఆ తర్వాత మాత్రం పెద్దలకి తెలీనీకుండా సినిమాలకీ షికార్లకీ తిప్పటంలోనూ, చిన్నాచితకా కానుకలందించి అలరించటంలోనూ, పార్కుల్లో పొదరింట ప్రేమ పాఠాలు చెప్పి వరవశింపచెయ్యటంలోనూ బహు ఉత్సాహంగా తానే చొరవచూపించాడు,

అంతే- ఆపైన పెసరంత చనువు తీసుకోటానికి సుభద్ర ఒప్పుకున్నదికాదు, వలుకమారినపండుని చెట్టెక్కి కోసుకోనివ్వకపోతే చాటుగా రాయివిసిరన్నా అనుభవానికి తెచ్చుకోవాలనిపిస్తుంది కానీ చూస్తూచూస్తూ ఒదులుకోబుద్ధికాదుకదా!

తాకబోయినప్పుడల్లా మధ్య తరగతి ఆడపిల్ల మనస్తత్వంతోపెళ్ళిపెళ్ళి అని కలవరిస్తూ దూరం జరిగి మాయమాటలు చెప్పక తప్పని పరిస్థితులు శరత్‌కి తెచ్చిపెట్టింది సుభద్రే.

అంచేత- శరత్ ఆమెకు మనకులగోత్రాలొకటి కాకపోవటం వల్ల మీమాపెద్దలు మనపెళ్ళికి అంగీకరించరని ఒకవిధంగా నిజంచెప్పినా,-

మనం పారిపోయి పెళ్ళిచేసుకుంటే చచ్చినట్లు వాళ్ళే సద్దుకుంటారని అబద్ధంచెప్పినా,- అలా పారిపోయాక ఒగదిలో దండలు మార్చి ఇదేపెళ్లని మభ్యపెట్టినా,-

పబ్బంతీరి మోజుతగ్గాక సిదారిఇదని ఒకబ్రోకరుచేతికి అప్పగించి రైలెక్కేసినా, అది సుభద్ర తప్పే అవుతుంది కానీ శరత్‌దికాదు!

'చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ' అలా ఈకూపానికి దారిచేసుకున్నది సుభద్ర!

★ ★

"తెలిసీ తెలీని తనంతో మోసపోయాం. ఓ భగవంతుడా కనికరించి మాకు ఇక్కణ్ణించి విముక్తి కలిగిస్తివా ఇక మళ్ళీ అలా బుద్ధిమాలి ప్రవర్తించం" చెయ్యెత్తి నమస్కరించింది సీతాలు.

"అంత అదృష్టమా" సుభద్ర నిస్పృహపడింది.

"అద్భుతం జరగాలి" అని సాకేత అభిప్రాయపడింది.

★ ★

నిజంగా అద్భుతమే జరిగింది. ఏపోలీసు అధికారికి హటాత్తుగా తనకర్తవ్య నిర్వహణ గుర్తొచ్చిందోగానీ అరోజే మెరుపుదాడిలా ఆ వ్యభిచార గృహంమీద రైడింగ్ జరిగింది. గమ్మత్తుగా ఆ ముగ్గురూ ఎవరిచేతికీ చిక్కకుండా తప్పించుకున్నారు!

★ ★

తుఫాను వెలిసిన వాతావరణంలా నీరవ నిశ్శబ్దమావరించి ఉన్న ఆ ఇంట్లో, అప్పుడే శవాల్ని దించొచ్చిన వాళ్లలా గుబులుగా విచారంగా ముగ్గురు మగవాళ్ళూ

"నాపిట్ట చేజారినట్టే" నీరసంగా కూలబడుతూ అన్నాడొకడు,

"ఏం?"

"దాని అయ్య కులపెద్దలకి తప్పుకట్టేశాడు. దానిబావనిచ్చి పెళ్లిచేసేశాడు. ఇప్పుడదినన్ను చూసిందంటే ముక్కువిరగ్గొట్టించగలదు"

"నా కేసూ అంతే అయిందిరా" చెప్పాడింకొకడు.

"ఏమయిందేమిటి?"

"దాని తండ్రి తనకూతురు ఫారిన్‌టూర్ వెళ్లొచ్చిందని బొంకాడు. అది అబద్ధమని తెలిసినా కాదనగలిగే ధైర్యమెవరికుంటుంది. వాళ్ల ఐశ్వర్యం అందరినోళ్ళూ కట్టేసింది. ఫారిన్‌లోవున్న కుర్రాడితో పెళ్లి జరిపించి పర్మినెంటుగా ఫారిన్ పంపేశాడు. నేను కంటపడితే ఖైదులో పెట్టించి నామరూపాల్లేకుండా మాపేయగలడు." ఉస్సురన్నాడు రెండోవాడు!

"ఒరే-వీడు అనుభవజ్ఞుడురా ఇవి దొరకని బాపతని ముందేచెప్పాడు. విన్నాంకాదు. చూడు ఈ తిరుగుడు శ్రమలేకుండా కాళ్లారజాపుకు కూర్చున్నాడు"

మూడోవాడి గురించిన వ్యాఖ్యానమది,

ఆ మూడోవాడనబడే వాడు నిట్టూర్చాడు

"నాకు తెలుసురా, గూటికి చేరకముందయితే ఏమోగానీ అడంగుకి చేరాయో- అవి మనకిక దక్కవన్నమాటే. మీపిచ్చిగానీ ఎంతచెడితే మాత్రం ఎవరిబిడ్డల్ని వాళ్లొదులుకుంటారట్రా-? ప్రాణప్రదమైనవి పోయి దొరికితే కడుపులో పెట్టుకుదాచుకుంటారుకానీ మళ్ళీబజారు పాలయ్యేందుకు అనువుగా ఉంచుతారా!"ఎంతో కాచివడబోసిన వాడిలా చెబుతోన్న అతనిమాటలు పూర్తికానేలేదు-ఎవరో వచ్చిన చప్పుడుకు తలెత్తి చూశారు ముగ్గురూ,

"పొరపాటు వడ్డావయ్యా నువ్వు!" గుమ్మం మధ్యలో దైన్యం మూర్తీభవించినట్టు నిలబడి రుద్ధకంఠంతో అంటోందా అమ్మాయి "నిజాన్ని ఒప్పుకునే ధైర్యమూ, తప్పుని క్షమించగలిగే ఔదార్యమూగల దిగువతరగతినీ, తప్పుచేసినా కమ్ముకోగలిగే సమర్థతా, నెగ్గించుకోగలిగే అంతస్తూకల పైతరగతినే చూశావు నువ్వు.

ఎవరేమనుకుని పోతారో అని క్షణక్షణమూ సమాజానికి వెరుస్తూ నిత్యమూ ఛస్తూ బ్రతికే మధ్య తరగతి జాతిని నువ్వెరగవ్. లేనిపోని భేషజాలకోసం, అక్కరలేని అభిమానాలకోసం కన్నపిల్లల్నీ కట్టుకున్న భార్యనేకాదు- వంచప్రాణాల్ని కూడా ఒదులుకుంటారయ్యా వాళ్లు.

ఆ తరగతి- దౌర్భాగ్యురాల్ని నేను.

లేచొచ్చినదాన్ని ఇంట్లోపెట్టుకుంటే రేపుబజార్లో మొహమెత్తి నడవగలనా అని నన్ను ఇంటిగుమ్మం తొక్కనివ్వలేదు నాతండ్రి.

కన్న మమకారం పీడిస్తున్నా మిగిలిన బిడ్డల భవిష్యత్తుకోసం కళ్లొత్తుకుంటూ నన్నుత్యాగం చేసేసింది మాఅమ్మ.

ఈ మురికిలోనే బ్రతుకు పొమ్మని నన్నొదిలేశారయ్యా వాళ్లు. చావటానికన్నా సాహసం లేని నేను మీరు వెతక్కపోయినా మీకాళ్లదగ్గరికే వచ్చేశానయ్యా."రెండుచేతుల్తో మొహంకప్పుకు విలపిస్తోందా అమ్మాయి.

ఆ అమ్మాయి సుభద్ర.